క్లుప్తంగా

విత్తన దుకాణాలపై దాడులు



రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ అధికారులు

నందవరం: ఎరువులు, విత్తన దుకాణాలపై ఇంటర్నల్ స్క్వాడ్ ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. మూడు విత్తన దుకాణాల్లో తనిఖీ చేపట్టి రూ.4.32 లక్షలు విలువచేసే విత్తన విక్రయాలను నిలుపుదల చేశారు. గురువారం మండలం స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి, నందవరం ఏఓ మర్రి స్రవంతి నందవరంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. జోషిత ఫర్టిలైజర్, శ్రీలక్ష్మి నరసింహ స్వామి, గురు కృప సీడ్స్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జోషిత ఫర్టిలైజర్స్‌లో రూ.1.48 లక్షలు, శ్రీలక్ష్మి నరసింహ స్వామి దు కాణంలో రూ1.77 లక్షలు, గురు కృప సీడ్స్ దు కాణంలో రూ.1.06 లక్షలు, మొత్తం రూ.4.32 లక్షలు విలువ చేసే విత్తన అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు.

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఏఎస్‌ఎల్ పార్శిల్ సర్వీస్‌లో కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ మహేశ్వరరెడ్డి తనిఖీలు నిర్వహించి అనుమతిలేని రూ. 2.57 లక్షల విలువ చేసే మిరప విత్తనాలను సీజ్ చేశారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రఘురామిరెడ్డి 104 వైద్య శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులకు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు ఇచ్చారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆస్పరి: మండలంలోని ములుగుందం జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంపీడీఓ రాణెమ్మ తనిఖీ చేశారు. భోజనం రుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హైస్కూల్లో గదుల కొరత గురించి ఎంపీడీఓకు వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో 32 మంది రైతులకు కౌలు హక్కు కార్డులను (సీసీఆర్‌సీ) పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఆంతోని, ఏఓ శివశంకర్ తెలిపారు. చింతకుంట గ్రామంలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్డుల ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, పంటల నమోదు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రైతు భరోసా పథకం వర్తిస్తాయన్నారు.

లాభాల బాటలో నడిపిస్తాం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక టౌన్ బ్యాంక్‌ను పాలకవర్గ సభ్యులు, ఖాతాదారుల సహకారంతో లాభాల బాటలో నడపిస్తామని చైర్మన్ యూకే రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బ్యాంక్‌లో పాలకవర్గం సభ్యులతో సమావేశం నిర్వహించారు. సీఈఓ గంగాధర్ లావాదేవీలు తదితర అంశాల నివేదికను వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు సభ్యులు కృషి చేయాలన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. డైరెక్టర్లు తట్టిబుడ్డప్ప, సయ్యద్ చాంద్, మహనందయ్యశెట్టి, వడ్డె రంగన్న, రజాక్,పల్లవి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొందరపాటు నిర్ణయాలు వద్దు

కృష్ణగిరి: క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని సీఐ యుగంధర్ విద్యార్థినులకు సూచించారు. కంబాలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం ఆయన ఇంటర్మీడియెట్, 9, 10వ తరగతి విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, గురువుల పట్ల అంకితభావంతో ఉండాలని సూచించారు. సమస్య ఎదురైనప్పుడూ ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈవ్‌టీజింగ్, దిశ యాప్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

తుగ్గలి: జొన్నగిరి చెరువు నుంచి కొందరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో ప్రైవేటు వెంచర్లకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జొన్నగిరి చెరువులో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎలక్ట్రీషియన్ దుర్మరణం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్ పైకప్పున నిల్చొని విద్యుత్ వైర్లు రిపేర్ చేస్తుండగా పెంకులు జారిపడడంతో కిందపడి ఎలక్ట్రీషియన్ తుక్క రామలింగప్ప (50) మృతి చెందాడు. ముగతిపేటకు చెందిన రామలింగప్ప బుధవారం పనులు చేస్తూ కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అడిగి మరీ ఇచ్చారు



నా పేరు సిద్ధమ్మ. బిల్లేకల్లు గ్రామం. నా కూతురు బిల్లేకల్లు జెడ్పీటీహెచ్ఎస్ స్కూల్లో 6వ తరగతి చదువుతోంది. పాఠశాలలో కులం, ఆధాయం ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి అడగ్గా సర్టిఫికెట్ల కోసం విన్నవించుకున్నాను. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒక్క రూపాయి తీసుకోకుండా సర్టిఫికెట్లు ఉచితంగా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

జగనన్నకు కృతజ్ఞతలు



ఈ చిత్రంలో ఉన్న యువతి పేరు హైమావతి. బిల్లేకల్లు గ్రామం. ఇటీవలే పెళ్లి చేసుకుంది. ప్రభుత్వం అందించే పెళ్లి కానుక కోసం బర్త్, ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్లు అవసరమయ్యాయి. సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉచితంగా ధ్రువ పత్రాలు ఇచ్చారు. ఇంత త్వరగా సర్టిఫికెట్లు అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

అవస్థలు తప్పాయి



నా పేరు విశాలమ్మ, మద్దికెర మండలంలోని ఎం.అగ్రహారం గ్రామం. నా కుమారుడిని 6వ తరగతిలో చేర్చాలంటే కులం సర్టిఫికెట్ అడిగారు. ఎవరిని అడగాలో; ఎలా తీసుకోవాలో? తెలియక మథనపడుతుండగా సచివాలయంలో వెంటనే ఇస్తున్నట్లు తెలిసింది. అక్కడికి వెళ్లి అధికారులకు చెప్పగా అన్ని వివరాలు తీసుకొని వెంటనే ఉచితంగా సర్టిఫికెట్ అందజేశారు. చాలా సంతోషంగా వుంది. తిరిగే పని తప్పిపోయింది.

- సులభంగా, వేగంగా ధ్రువపత్రాల జారీ
- ఉచిత సేవలపై ప్రజల హర్షం

సురక్షతో చింత లేదిక..

కృష్ణగిరి: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. ఎరుకలచెరువు గ్రామంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రహదారులను ఆమె ప్రారంభించారు. అలాగే చుంచుఎర్రగుడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ విశ్వమోహన్, వైస్ ఎంపీపీ రాజేష్, సర్పంచ్ మాదేవమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 7, 8, 9, 10 వార్డు సచివాలయాల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ అంజనేయులు, ఆయావార్డుల ఇన్‌చార్జ్‌లు సునీల్‌కుమార్, శివసూర్యనారాయణ, కౌన్సిలర్ రాజారత్నంలతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రజలకు కావాల్సిన వివిధ ధృవపత్రాలను అందజేశారు.

గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి, చిన్నమరివీడు గ్రామాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి పాల్గొని దరకాస్తుదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.





ఎరుకలచెరువులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

తుగ్గలి: మండలంలోని ఉప్పర్లపల్లి, రామకొండ గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ సావిత్రి, తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు ప్రభాకరరెడ్డి, సుధాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనిప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేశారు.

ఆస్పరి: మండలంలో తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు వివిధ సర్టిఫికెట్లు మంజూరు చేయగా సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, జేసీఎస్ మండల కన్వీనర్ బసవరాజు, బల్లేకల్లులో సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు సుంకమ్మ, ములుగుందం-2లో ఎంపీటీసీ వీణ పంపిణీ చేశారు. రెండు గ్రామాలలో గురువారం 353 సర్టిఫికెట్లు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు.

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



కౌలు రైతు కార్డు అందజేస్తున్న అధికారులు

హొళగుంద: చిన్నహ్యాటలో తహసీల్దారు హుసేన్‌సాహెబ్, హెబ్బటంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చిన్నహ్యాటలో 700 మందికి గాను 550 మందికి, హెబ్బటంలో 654 మందికిగాను 637 మందికి అక్కడికక్కడే వివిధ రకాలు ధ్రువపత్రాలు అందజేశారు.

వెల్దుర్తి: ఎల్ నగరంలో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ దేశాయ్ సమీర్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, డీటీ ప్రసాదరాజు, ఈఓఆర్డీ నరసింహులు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ మహేశ్వరి పాల్గొన్నారు. 98 మందికి వివిధ రకాల ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందించారు.

దేవనకొండ: స్థానిక గ్రామ సచివాలయంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో 42 మంది దరకాస్తుదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు.

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 301 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అధికారులు అందించారు. తహసీల్దార్ లక్ష్మినారాయణ, వైస్ ఎంపీపీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



నేను రెండుఎకరాల పొలం కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగుచేస్తున్నాను. కౌలు రైతులకు ప్రభు త్వం పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, ఇందుకు సీసీఆర్‌సీ కార్డు పొందాలని తెలిసింది. గతంలో కౌలు కార్డు పొందేందుకు చాలా ఇబ్బందులు పడ్డాను. జగనన్న సురక్ష కార్యక్రమంలో భా గంగా అధికారులు ఒక్కరోజులోనే కౌలుకార్డు అందజేశారు. ఇకపై నాకు కూడా యాజమాన్య రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి.

–బోయ మల్లేష్, కౌలు రైతు, గంజిహళ్లి గ్రామం

ఖర్చు లేకుండా ఇచ్చారు



నేనే డిగ్రీ చదివాను. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం కావడంతో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. రెండు రోజుల్లోనే ఎలాంటి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. సురక్ష కార్యక్రమం ద్వారా వ్యయ ప్రయాసలు తగ్గి తక్కువ వ్యవధిలోనే సర్టిఫికెట్లు అందాయి.

– పవన్‌కుమార్, పెండేకల్లు రైల్వే జంక్షన్

ఇంత త్వరగా ఇస్తారనుకోలేదు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు అడంగల్, వన్‌బీ లాంటి పత్రాలు ఇంత సులుభంగా వస్తాయని అనుకోలేదు. నాకు వీటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలీదు. వలంటీర్, సచివాలయ ఉద్యోగి వచ్చి వాకబుచేయగా క్యాస్ట్, ఇన్‌కంతో పాటు అడంగల్ కావాలన్నా. వివరాలు నమోదు చేసుకున్నారు. గురువారం ధ్రువపత్రాలు నా చేతిలో పెట్టారు. నా లాంటి చదువు లేని వాళ్లకు కూడా ఇంత సులభంగా ధ్రువపత్రాలు అందుతున్నాయంటే ఆనందంగా ఉంది.

–కురువభారతి,బీజీ హళ్లి,హొళగుంద మండలం

రోగులకు మెరుగైన సేవలందించండి

ఎమ్మిగనూరుటౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు, సిబ్బంది కొరత ఉంటే తమ దృష్టికి తేవాలని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రికి ఏ సమయంలో రోగులు వచ్చినా సరైన చికిత్సలందించాలన్నారు. ప్రస్తుతం రోజుకు వచ్చే ఓపీ వివరాలతో పాటు ఆస్పత్రిలో కాన్పుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నెలకు 200కు పైగా ఆస్పత్రిలో కాన్పులు చేస్తున్నామని సూపరింటెండెంట్ మైత్రేయి ఎమ్మెల్యేకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

వివరించగా వారిని అభినందించారు. ఆస్పత్రిలో జనరల్ ఫిజిషియన్ నియామకానికి, వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం సత్వరం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ, అల్లబకాష్, ఆస్పత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 23వ వార్డు పరిధిలో వార్డు కౌన్సిలర్ చంద్రమోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మద్దతు



ఎమ్మిగనూరు 23వ వార్డులో మహిళకు బుక్‌లెట్ ఇచ్చి మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఇవ్వాలని కోరారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, యూకే వీరేంద్ర, నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, ఎంకే శివప్రసాద్, ఇషాక్, అమాన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాలల హక్కులను పరిరక్షించాలి

హొళగుంద: బాలల హక్కుల పరిరక్షించాలని, వీధి బాలలను బడిలో చేర్పించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) జిల్లా కన్వీనర్ లింగన్న అన్నారు. ఆయన గురువారం హొళగుంద కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బడి బయట ఉన్న ఇద్దరు బాలికలను విద్యాలయంలో చేర్పించారు. ఆయన మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించనప్పుడే బాలలకు నిజమైన స్వేచ్ఛ దొరుకుతుందన్నారు. యంపీఎఫ్ సభ్యుడు సేవానాయక్ ఉన్నారు.

విచారణ చేపట్టాలి

గోనెగండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన నాడు-నేడు పనులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జూనియర్ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ గోనెగండ్ల జూనియర్ కళాశాల అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొబ్బరి మొక్కల పంపిణీ

గోనెగండ్ల: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతులకు వంద శాతం సబ్సిడీ కింద పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఏపీఓ మహమ్మద్ బాష తెలిపారు. గురువారం గోనెగండ్లలో రైతులకు కొబ్బరి మొక్కలను ఉపాధి హామీ పథకం ఈసీ ఉస్మాన్ బాష పంపిణీ చేశారు. ఏపీఓ మాట్లాడుతూ.. 5 ఎకరాలలోపు పొలం కలిగిన రైతులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను పంపిణీ చేస్తుందని తెలిపారు. గురువారం మండలానికి 4 వేల కొబ్బరి మొక్కలు రాగా ఆయా గ్రామాల రైతులకు ఎకరానికి 70 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. మొక్కల పెంపకానికి ప్రభుత్వమే నిధులు అందిస్తుందని తెలిపారు. అలువాల సర్పంచ్ బాష పాల్గొన్నారు.

జీవనోపాధులపై అవగాహన

మద్దికెర: పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను, రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందేలా అవగాహన కల్పించాలని రీజనల్ కో ఆర్డినేటర్ షణ్ముఖ శర్మ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలకు జీవనోపాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల కుటుంబాల స్థితిగతుల గురించి తెలుసుకొని వారు స్వతంత్రంగా వ్యాపారాలు, కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం చేపట్టేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఏపీ రీజనల్ కో-ఆర్డినేటర్ మహిళా సాధికారత పుస్తకాలను పంపిణీ చేశారు. ఏపీఎం మధుబాబు, సీసీలు కళావతి, వీఓఏలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ చేయించుకోవాలి

దేవనకొండ: ఖరీఫ్-2023కు సంబంధించి ప్రతి రైతు సాగుచేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ సురేష్‌బాబు సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఆధార్‌కార్డు, 1బీ, పొలం పాసు పుస్తకం జిరాక్సులు జతజేసి దరఖాస్తును వ్యవసాయ అధికారులకు అందజేయాలన్నారు.

మంత్రిని విమర్శించే స్థాయి వారికి లేదు

ఆలూరు: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను విమర్శించే స్థాయి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బోయ తిక్కయ్యనాయుడుకు లేదని ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. స్థానిక యార్డు చాంబర్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5న ఆలూరులో టీడీపీ బస్సు యాత్రకు జనం రాలేదనే అక్కసుతో మంత్రి గుమ్మనూరు జయరాంపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరేందుకు వెళ్లిన నాయకులను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పోలీసుల



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

చేత గెంటివేసిన సంఘటన మీకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. చింతకుంట సింగిల్ విండో చైర్మన్ అర్జగేరి శ్రీనివాసులు, నాయకులు ఈరన్న, శ్రీధర్, గోవిందు తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కృష్ణగిరి: రైతులే దేశానికి వెన్నముక అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. కంబాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆమె పీఆర్ డీఈ శేషయ్య, అగ్రికల్చర్ ఏడీఏ మోహన్ విజయకుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. రాజన్న స్వర్ణయుగంలో వ్యవసాయాన్ని పండగ చేయగా ఆయన బాటలో తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నడుస్తున్నాడన్నారు. రైతులు కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆర్బీకే ఆవరణలో మొక్క లు నాటారు. అనంతరం ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. సగానికిపైగా గదుల పైకప్పు పెచ్చులూడిపోవడంతో పిల్లలు ఏలా ఉంటారని ప్రశ్నించారు. సమస్యపై వెంటనే డీడీతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసు కుంటామని ఆయన హామీఇచ్చారు. కృష్ణగిరి సహ కార సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, శిగరమాను కృష్ణమూర్తి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ విశ్వమోహన్,ఏఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

తుగ్గలి: మారుమూల గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో కర్నూలు జెమ్‌కేర్ కామినేని ఆస్పత్రి



కంబాలపాడులో ఆర్బీకే ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవిని గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

వారు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన 200 మందికి ఆస్పత్రి సీఈఓ డాక్టర్ ఎస్‌వి చంద్రశేఖర్, గుండె వైద్య నిపుణులు చెరుకు రాఘవేంద్ర ఎకో, బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీఎంవో కృష్ణ, డీజీఎం రమణ బాబు, ఎస్ఆర్ఎం వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ బోధనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు

మద్దికెర: అర్హత ఉంటే చాలు కుల, మత రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం ఎం.అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎవరికైనా పథకాలు అందకపోతే తెలియజేయాలని వారికి లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ విజయుడు, వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి, ఎంపీటీసీ వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవి-ఇవి

మైనారిటీ గురుకులంలో అడ్మిషన్లు

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా కేంద్రంలోని చెన్నమ్మ సర్కిల్‌లో ఉన్న ఏపీ మైనారిటీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు రెండవ విడత దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు రాయలసీమ రీజియన్ రీజనల్ కన్వీనర్ డాక్టర్ జయం శ్రీనివాస గుప్త గురువారం తెలిపారు. ఎంపీసీలో 13, బైపీసీలో 12, సీఈసీలో 24 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఈనెల 15వ తేదీలోగా కర్నూలు ఏపీఆర్‌జేసీ బాలుర మైనారిటీ జూనియర్ కళాశాలలో సంప్రదించి అడ్మిషన్లు పొందాలని సూచించారు.

డీయస్టీ హాస్టల్‌ను పునరుద్ధరించండి

దేవనకొండ: మండలంలో డీయస్టీ హాస్టల్‌ను పునరుద్ధరించాలని కర్నూలు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కాకర్ల శాంతికుమార్ కోరారు. ఆయన గురువారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు.

క్రమబద్ధీకరణ చేపట్టాలి

వెల్దుర్తి: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రతినిధి నాగరాజు డిమాండ్ చేశారు.గురువారం వారు స్థానిక వీఓఏలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల మండల ప్రతినిధులతో వారివారి కార్యాలయాలలో సమావేశమయ్యారు. సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్, వీఓఏల సంఘం ప్రతినిధులు సూర్యచంద్ర, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని 288 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్ల మద్యం, 48 నాకౌట్ బీర్లను సీజ్ చేసినట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఆలూరు మండలం అరికెర గ్రామ సమీపంలో వాహన తనిఖీలు చేశామన్నారు. హొళగుందకు చెందిన సలీమ్, ముద్దటమాగి గ్రామానికి చెందిన దుర్గన్న స్కూటర్‌పై అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి స్కూటర్ సీజ్ చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జయరాం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా అభిమానాన్ని చురగొన్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆలూరు మండలంలోని మనేకుర్తి గ్రామంలో గురువారం మండల కన్వీనర్ వీరేష్, సర్పంచ్ కొల్లమ్మ సమక్షంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, సచివాలయ కన్వీనర్ ఈరన్న, రాంభీమ్‌నాయుడు, దీపక్‌కుమార్,ఎంపీడీఓ అల్లబకాష్, తహసీల్దార్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గురువారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని పలు పార్టీలు, ప్రజా సంఘాలు నిర్వహించాయి. 8వ వార్డు సచివాలయ ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌చైతన్య ,నవ్యంధ్రా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్, మహిళా అధ్యక్షురాలు బతుకమ్మ, తాలుకా అధ్యక్షుడు పుట్టపాశం మారెప్పలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు



విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల: డీలర్లు అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి హెచ్చరించారు. గురువారం గోనెగొండ్లలో శ్రీలక్ష్మి నరసింహస్వామి ట్రేడర్స్, కిరణ్ హైబ్రిడ్స్ సీడ్స్‌ను డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శశిధర్‌లతో కలిసి ఆమె తనిఖీ చేశారు. అనుమతులు లేని విత్తనాలు పత్తి 1.1 క్వింటా, కందులు 1.75 క్వింటా, మిరప 0.28 క్వింటా, కూరగాయలు 2.2 క్వింటాలు మొత్తం రూ.29 లక్షల విలువ గల విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.